క్లుప్తంగా

కొవ్వొత్తులతో ర్యాలీ

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని గత 85 రోజులుగా దీక్షలు కొనసాగుతున్నాయి. కాగా శనివారం బోథ్ మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ చేయాలని గ్రామస్తులు నినాదాలు చేశారు. ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి, ఉద్యమంలో పాల్గొనాలని డిమాండ్‌చేశారు.

గిరిజన వర్సిటీ అనుబంధ క్యాంపస్ ఏర్పాటు చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో గిరిజన యూనివర్సిటీ అనుబంధ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని జనసేన ఖానాపూర్ ఇన్‌చార్జి ధారావత్ నరేందర్ నాయక్ అన్నారు. శనివారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ఏజెన్సీ గిరిజనులకు పీజీ విద్య అందడం లేదని, స్థానికంగా అనుబంధ క్యాంపస్ ఏర్పాటు చేసి, ఉన్నత విద్యనందించాలని కోరారు. సమావేశంలో నాయకులు మేడి శ్రీనాథ్, నరేశ్, వినిత్, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రావణ్, రవి, ప్రశాంత్, అరుణ్, క్రాంతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందిస్తాం

నార్నూర్: గ్రామస్తుల సహకారం, ఉపాధ్యాయుల సమన్వయంతోనే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తామని ఎంఈవో రాపల్లి ఆశన్న అన్నారు. శనివారం నార్నూర్ మండలంలోని గుంజాల ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో అస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు రామారావు, లక్ష్మీకాంతంలను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుభాణి, సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

ఎదులాపురం: కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి జోగు రామన్నపై ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. కుక్కర్ల పంపిణీ విషయంలో జరిగిన ఘటనను ఎమ్మెల్యేకి ఆపాదించి విమర్శలు చేయడం తగదన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి సాజిదొద్దీన్, పట్టణ కార్యదర్శి అష్రఫ్, సలీం పాల్గొన్నారు.

సన్మానం

జైనథ్: మండలంలోని తరోడ గ్రామంలో ఉద్యోగాలు సాధించిన యువతీ, యువకులను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన మోర్లే పల్లవి, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన గుంజాల వెంకన్న, రఘు, ఆర్‌ఆర్‌బీలో ఉద్యోగం సాధించిన హరికృష్ణలను సత్కరించారు.

తలమడుగు: ఇటీవల ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం పొందిన తలమడుగు మండల కేంద్రానికి చెందిన స్వయందీప్‌ను తోటి విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపి స్వీట్లను తినిపించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సాయికుమార్, నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షణీయం

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన కబడ్డీ క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. పోలీస్‌శాఖ, ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన జిల్లాకు చెందిన పలువురు కబడ్డీ క్రీడాకారులను ఆయన నివాసంలో శనివారం సన్మానించారు. చదువుతోపాటు క్రీడలకు సముచిత స్థానం ఇవ్వాలన్నారు. నిరుద్యోగులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్ తహసీల్దార్ భుజంగ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నష్టపోతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి మైదాన ప్రాంతాల నుంచి గిరిజనేతరులు, వలసలు పెరగడం వలన ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ చట్టాలు, హక్కులు నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుడ్మెత మారుతి, ఆత్రం మారుతి, మడావి జయ్, నగేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: మండలంలోని టివిటిపల్లె గ్రామానికి చెందిన కొడప భీంరావ్ అనే వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. శనివారం ఎంపీపీ తుల శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నక్కలవాడ సర్పంచ్ విజయ్, సురేష్, భీముడు, దేవేందర్, జుగాదిరావ్ ఉన్నారు.

ఆధార్ ఉంటేనే కొనుగోళ్లు

బోథ్: సీసీఐ ఆధ్వర్యంలో జరిగే పత్తి కొనుగోళ్లలో రైతులకు ఆధార్ కార్డు ఉంటేనే కొనుగోళ్లు చేపడుతామని బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

రూ.2 కోట్లతో వాకింగ్ ట్రాక్

- రెండు నెలల్లో పూర్తి చేసేలా అధికారుల ప్రణాళిక
- మూడు కిలోమీటర్ల మేర నిర్మాణం
- తీరనున్న వాకర్స్ కష్టాలు



అధునాతన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్న ప్రాంతం

కైలాస్‌నగర్: ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే నడక ఎంతో ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. రోజులో కనీసం గంట పాటు వాకింగ్ చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించడంతో పాటు ప్రశాంతంగా ఉండవచ్చని సూచిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎంతో మంది ప్రతినిత్యం వాకింగ్ చేస్తూ.. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నారు. ఇలాంటి వారి సౌకర్యార్థం అధునాతన వసతులతో కూడిన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ యంత్రాంగం నిర్ణయించింది. రెండు కోట్ల వ్యయంతో చేపట్టనున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ శుక్రవారం భూమిపూజ చేశారు. రెండు నెలల వ్యవధిలో పూర్తి చేసేలా బల్దియా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

మూడు కిలో మీటర్లు..

ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే ప్రజల ప్రయోజనార్థం సుందరమైన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ చౌక్ నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు, కొండ లక్ష్మణ్ బాపూజీ చౌక్ నుంచి గాంధీ పార్కు చుట్టూ మూడు కిలో మీటర్ల మేర 12 మీటర్ల వెడల్పుతో ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందు కోసం పట్టణ ప్రగతి నిధులు రూ. రెండు కోట్లు కేటాయించారు. ఉదయం, సాయంత్రం వాకర్స్‌కి ఇబ్బంది కలుగకుండా వెలుగులు పంచే ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

దూరం కానున్న ఇబ్బందులు



రోజు ఎంతో మంది ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వస్తున్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మాత్రమే వాకింగ్ ట్రాక్ ఉంది. అక్కడ నడవడం ద్వారా క్రీడాకారులకు ఇబ్బంది అవుతుంది. అధునాతన వాకింగ్ ట్రాకింగ్‌ను తీసుకురావాలనే అధికారుల నిర్ణయం హర్షణీయం.

– లోక ప్రవీణ్ రెడ్డి, మార్నింగ్ వాకర్

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత



ఆదిలాబాద్ పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రతీ వార్డులో ఓపెన్ జిమ్‌లతో పాటు క్రీడా మైదానాలు ఏర్పాటు చేశాం. తాజాగా వాకర్స్ కోసం రూ.2 కోట్ల వ్యయంతో అధునాతన వసతులతో కూడిన ట్రాక్‌ను నిర్మిస్తున్నాం. త్వరలోనే దీన్ని అందుబాటులోకి తీసుకువస్తాం.

– జోగు ప్రేమేందర్, మున్సిపల్ చైర్మన్

జవాన్‌కు ఘన స్వాగతం



ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు, గ్రామస్తులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మాడవి రాజ్‌కుమార్‌కు శనివారం సర్పంచ్ మెస్రం దేవురావు, గ్రామ పటేల్ మెస్రం భీంరావు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆర్మీ ఉద్యోగంలో చేరి తొలిసారిగా స్వగ్రామానికి తిరిగి రావడంతో ఆదివాసీ గిరిజనులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. యువత రాజ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవారి జగ్గేరావు, కారోబారి మండాడి దౌలత్‌రావు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు మెస్రం లింగు, ఉపాధ్యాయుడు లక్ష్మణ్, వెడ్మా జ్యోతిరాం, అంబురావు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాంసి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంరం కోటేష్ కోరారు. శనివారం మండలంలోని గిరిగాం, అంబుగాం, అట్నంగూడ గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ కార్డులను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామన్న యాదవ్, వెంకట్ రెడ్డి, రాకేశ్, రాములు, గంగారాం పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఇచ్చోడ: పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వచ్చే వరకు పారిశుధ్య పనులు నిలిపివేయనున్నట్లు ఇచ్చోడ పంచాయతీ పారిశుధ్య కార్మికులు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పుష్పకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేశారు. ఇచ్చోడ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య తమకు ఆరు నెలల నుంచి వేతనాలు రావడం లేదన్నారు. చాలీచాలనీ జీతంతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా.. పట్టించుకోడవం లేదన్నారు. గత్యంతరం లేక పనులు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కొలిపాక అశోక్, యూసుఫ్, భూమారెడ్డి, ఆశన్న, అంజీ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నార్నూర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. శనివారం తాడిహత్నూర్ పరిధిలోని ముక్తాపూర్‌లో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్‌తో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం.. అభివృద్ధికి ప్రాధాన్యం



చీరలు పంపిణీ చేస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని రాజుర, వాంకిడి గ్రామాల్లో మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు క్రీడ సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సర్పంచులు అనసూయ, అడిగం రాజు, మనీషా, నాయకులు సాబ్లే నానాక్ సింగ్, ప్రతాప్ సింగ్, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



సమావేశమైన నాయకులు

ఉట్నూర్‌రూరల్: గిరిజనేతర సంఘం కార్యవర్గాన్ని శనివారం ఉట్నూర్ హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దావుల రమేశ్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ రషీద్, సింగారే భరత్, ఇలియాస్, ప్రధాన కార్యదర్శిగా సోఫియాన్, జాయింట్ సెక్రెటరీగా కేంద్ర రమేశ్, ప్రచార కార్యదర్శిగా గాయక్వాడ్ భరత్, ట్రెజరర్‌గా గోపాల్‌సింగ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గిరిజనేతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని మత్తడిగూడ, శంభుగూడ గ్రామాల్లో ఎంపీపీ జైవంత్‌రావు శనివారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అదే విధంగా శంభుగూడ గ్రామానికి చెందిన ఆత్రం తిరుమన్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికవడంతో యువకుడిని సన్మానించారు. ప్రజలు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ.. బతుకమ్మను ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర సర్పంచ్ లత, మత్తడిగూడ సర్పంచ్ యశోదబాయి, మోతీరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఖండో గ్రామ పంచాయతీ పరిధిలో స్పోర్ట్స్ కిట్స్, బతుకమ్మ చీరలను శనివారం సర్పంచ్ హెచ్‌కే చంద్రహారి, ఎంపీటీసీ కిరణ్‌లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఎదులాపురం: పోషకాహారం తీసుకోవాలని అర్బన్ సీడీపీవో వనజ అన్నారు. సుందరయ్యనగర్ ఒకటవ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో పోషణ్ మాటసం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ, బోనాలతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో సూపర్‌వైజర్ ఫర్హా, విజయలక్ష్మి, రూపావతి, నీరజ, పాఠశాల ప్రిన్సిపాల్ వినీల, అంగన్‌వాడీ టీచర్ రాధ పాల్గొన్నారు.

సోయా కోతలో బిజీబిజీ



ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోయా పంట చేతికి రావడంతో కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా.. రైతులు, కూలీలు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతీరోజు పని ఉండడంతో కూలీలకు ఉపాధి కూడా దొరుకుతోంది.

వన్య ప్రాణులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మావల మండలంలోని హరితవనం పార్కులో విద్యార్థులకు వన్య ప్రాణుల మనుగడకు ముప్పు అనే అంశంపై ఎఫ్‌డీవో బర్నోబా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్, ఎఫ్‌బీవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకులను నమ్మవద్దు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



కమ్యూనిటీ షెడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బేల: ఎన్నికల సమయంలో ఇచ్చే ప్రతిపక్షాల బూటకపు హామీలను నమ్మవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని సాంగ్వి(జి) గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో సవారీబంగ్లా షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. దహెగాంలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కాలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి, అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీష్ పవార్, వరాడే విఠల్, రాథోడ్ రోహిదాస్, కిష్టు, దత్తు, వినోద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



చెక్కు అందజేస్తున్న జోగు ప్రేమేందర్

ఎదులాపురం: ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తుండని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు, అమ్మఒడి, అల్పాహార పథకం యావత్ తెలంగాణ ప్రజానీకానికి అండగా ఉన్నాయన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, అఫ్రోజ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, పందిరి భూమన్న, సలీం, ఇమ్రాన్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

ఆదిలాబాద్: అన్నివర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలతో శనివారం భూమిపూజ చేశారు. గాంధీపార్క్‌లోని భీమన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రూ. 5 లక్షల నిధులతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దార వేణి రాము, దార్లా రవి, భొజ్జ సంతోష్, దార వేణి సత్యనారాయణ, వెంకటేశ్, ఆదినారాయణ, భగవాన్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆశవర్కర్ల సమ్మె



ఇచ్చోడ: సమ్మెల్లో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

ఇచ్చోడ: ఆశవర్కర్ల సమ్మె కొనసాగుతోంది. చాలీచాలనీ వేతనలతో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు రూ. 18 వేలు వేతనం చెల్లించాలని శనివారం నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ డిమాండ్లు నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం చొరవ చూపి ఆశవర్కర్లతో చర్చలు జరపాలన్నారు.

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్ల చేపట్టిన సమ్మె శనివారం 13వ రోజుకు చేరింది. ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు కాంతాబాయి మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు నెలకు రూ. 18 వేలు వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద భీమా, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కనక తులిసిబాయి, సుమిత్ర, సోను, జంగుబాయి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

'హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం'



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

కైలాస్‌నగర్: గత ఎన్నికల హామీల అమల్లో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఆర్‌ఆర్ నివాసంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌తో కలిసి మాట్లాడారు. గత కొన్ని రోజులుగా తీరిక లేకుండా యుద్ధం చేసినట్లుగా ఎక్కడ పడితే అక్కడ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరిట హడావిడి చేస్తున్నారని మండిపడ్డారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, చనాక కోర్టా బ్యారేజీ ఇప్పటి వరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పట్టణంలోని ప్రధాన చౌక్‌లకు మెరుపులు దిద్ది నేత్రానందం పొందుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, అంభకంటి అశోక్, వెంకట్ రెడ్డి, వసిమ్, సంజయ్, విఠల్, రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గుడిహత్నూర్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి హుస్నేన్ అన్నారు. మండలంలోని మచ్చాపూర్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు నేరమని, మహిళలు వేధింపులకు గురైతే చట్టాల ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. సర్పంచ్ ఆడే సంగీత, న్యాయవాదులు పంద్రం శంకర్, ధమ్మపాల్, విక్రంసింగ్, ఎక్సైజ్ సీఐ రాజమౌళి, ఎస్సై ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలని మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో వృత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రంలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, హక్కుల గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ.. భేటీ బచావో.. భేటీ పడావో పథకం, లింగ సమానత్వం, మహిళా చట్టాలు, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, వరకట్న నిషేధ చట్టంపై అవగామన కల్పించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, కోటేశ్వర్, నిఖిలేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని గిరిజన విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహాత, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజనుల సాంఘిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులపై సింపోజియం నిర్వహించారు. గిరిజన విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస స్వామి, ఆగస్టీన్, పుట్ట లక్ష్మణ్, ప్రొఫెసర్లు ముత్యం రెడ్డి, రమణమూర్తి, వీఎస్‌కే శాస్త్రి, గోపీనాథ్‌రెడ్డి, నరేంద్రబాబు, నగేశ్వర్ రావ్, మల్లికార్జున నాయక్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాథోడ్ రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, శ్రీరాంనాయక్, వెంకటేశ్, కొమ్ము రాంచందర్, లింగాగౌడ్, బొడ్డు కిరణ్, దేవిదాస్, భూపతి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.